క్లుప్తంగా

'జగనన్నకు చెబుదాం'పై అవగాహన



సీఎం ప్రసంగాన్ని వీక్షిస్తున్న ఎంపీడీఓ, సిబ్బంది

బుచ్చినాయుడుకండ్రిగ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో కలసి 'జగనన్నకు చెబుదాం' సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించడాన్ని టీవీలో వీక్షించారు. 1902 టోల్ ఫ్రీ నంబర్, ప్రభుత్వ సేవలపై మెరుగైన పరిష్కారం కోసం ప్రభుత్వం దీనికి పూనుకుందని చెప్పారు. ఈఓపీఆర్‌డీ రాజశేఖర్ పాల్గొన్నారు.

గంగజాతరకు ముస్తాబైన సత్యవేడు



జాతరకు విద్యుత్ దీపాల అలంకరణలు

సత్యవేడు: సత్యవేడులో 10,11వ తేదీలలో జాతర పురస్కరించుకుని నడివీధి గంగమ్మ గుడి వద్ద చలువ పందిళ్లు వేశారు. మంగళవారం జాతర నిర్వాహకులు గాంధీరోడ్డు, నేజారోడ్డు వద్ద విశేషంగా విద్యుత్ అలంకరణలు, పలు రోడ్ల కూడలి వద్ద భారీగా అమ్మవారి రూపాలతో విద్యుత్ దీపాల కటౌట్లు ఏర్పాటు చేశారు. మూడు రోడ్ల కూడలి లోని టవర్ క్లాక్ చుట్టూ విద్యుత్ లైట్లు అమర్చారు. గాంధీ రోడ్డులో రోడ్డుకు ఇరువైపులా వివిధ రకాల వస్తువిక్రయాల అంగళ్లు ఏర్పాటు చేస్తున్నారు. జాతర సందర్భంగా భక్తులు చిత్ర విచిత్ర వేషాలు వేసేందుకు ఉత్సాహంతో ఉన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



గర్భిణులకు భోజనాన్ని వడ్డిస్తున్న వైద్యాధికారిణి మాధవి

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో బుధవారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 70 మంది గర్భిణులకు వైద్యాధికారిణి మాధవి, డాక్టర్ దివాకర్ వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్త పరీక్షలు, బీపీ, షుగర్, హెచ్‌బీ, బరువు, రిపోర్టులను పరిశీలించారు. హైరిస్క్ గర్భవతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. 108 సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండలంలోని మారుమూల ప్రాంతాల నుంచి వచ్చిన గర్భిణులకు, వారి సహాయకులకు శ్రీవారి క్యాటరింగ్, సప్లయర్స్ నిర్వాహకులు భోజన సదుపాయం కల్పించారు. గర్భిణులు భోజనం లేకుండా పస్తులతో వెళ్తున్నారని తమ దృష్టికి రావడంతో భోజన వసతి కల్పించినట్లు చెప్పారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు సుబ్రమణ్యం, పద్మకుమారి, వైద్య సిబ్బంది పద్మశ్రీ, మీనాక్షి, రత్నమ్మ పాల్గొన్నారు.

స్నానం చేస్తుంటే.. కిటికీలోంచి చూస్తూ..

రేణిగుంట: శ్రీకాళహస్తి పట్టణం నెహ్రూ వీధిలోని వరదరాజస్వామి అతిథి గృహంలో తమిళనాడుకు చెందిన ఓ భక్తురాలు బాత్‌రూములో స్నానం చేస్తుండగా, అక్కడ పని చేసే కాంట్రాక్టు కార్మికుడు కిటికీలో నుంచి చూస్తు పట్టుబడ్డాడు. వివరాలు.. శ్రీకాళహస్తి ఆలయ అనుబంధ వరదరాజస్వామి అతిథి గృహం ఉంది. అక్కడ గదులను శ్రీకాళహస్తి ఆలయానికి వచ్చే భక్తులకు కేటాయిస్తుంటారు. ఈ క్రమంలో బుధవారం తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఓ కుటుంబం ఇక్కడ ఒక గదిలో అద్దెకు దిగింది. గదిలోని బాత్‌రూములో ఓ మహిళ స్నానం చేస్తుండగా, బయట కిటికీ నుంచి ఎవరో చూస్తున్నట్లు అలికిడి కావడంతో ఆమె కేకలు వేసింది. దీంతో కిటికీలో నుంచి చూస్తున్న కాంట్రాక్టు ఉద్యోగి రూప్‌కుమార్‌ను పట్టుకుని వన్ టౌన్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

వాటర్ ట్యాంకర్ వితరణ



వాటర్ ట్యాంకర్‌ను అప్పగిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

వెంకటగిరి: నేదురుమల్లి ఫౌండేషన్ చైర్మన్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం వైఎస్సార్ సీపీ ప్రచార విభాగం తిరుపతి జిల్లా అధ్యక్షుడు నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, పట్టణ కన్వీనర్ ఢిల్లీబాబు, వైస్ చైర్మన్ బాలయ్య, నేతలు చిట్టేటి హరికృష్ణ, న్యాయవాది లక్కమనేని కోటీశ్వరరావు మున్సిపల్ అధికారులకు వాటర్ ట్యాంకర్‌ను అందజేశారు.

కళ తప్పిన పార్కులు

అలంకారప్రాయంగా ఎన్టీఆర్ పార్కు



శ్రీకాళహస్తి పట్టణంలోని మున్సిపల్ పార్కులు అధ్వానంగా మారాయి. పలు పార్కుల్లో సమస్యలు తిష్ట వేశాయి. శ్రీకాళహస్తి దేవస్థానంలో ఒక్క పార్కు కూడా సక్రమంగా లేదు. వేసవి సెలవుల్లో కాస్త ఆటవిడుపుగా ఉంటుందని ఉల్లాసానికి..సేదదీరడానికి పిల్లలతో పార్కులకు వెళ్లేవారికి చివరకు నిరాశగా, అసంతృప్తితో వెనుదిరుగుతున్నారు. అధికారులు వీటి నిర్వహణపై దృష్టి సారించకపోవడంతో పార్కులు అధ్వానంగా మారాయని పట్టణ ప్రజలు మండిపడుతున్నారు.

- శ్రీకాళహస్తిలో అధ్వానంగా దర్శనమిస్తున్న ఉద్యానవనాలు
- ఎన్టీఆర్ పార్కులో వసతులు పూజ్యం

రేణిగుంట : నాలుగేళ్ల క్రితం పానగల్‌లో నందమూరి తారక రామారావు ఉద్యానవనం పేరుతో లక్షల రూపాయలు ఖర్చు చేసి మున్సిపల్ పార్కును ఏర్పాటు చేశారు. అయితే ఆ పార్కులో కనీస వసతులు లేవు. ప్రధానంగా విద్యుత్ లైట్లు అన్ని వైపులా ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి సమయంలో పార్కులోకి వెళ్లలేని పరిస్థితి. ఆటవస్తువులు ఏర్పాటు చేసినా ఒక్కటి కూడా పనిచేయని దుస్థితి నెలకొంది. పార్కులోని విద్యుత్ మోటార్ అప్పుడప్పుడూ పనిచేయకపోవడంతో తాగునీటి వసతి, మరుగుదొడ్లు తూతూమంత్రంగా మారాయి. పట్టణంలో పురాతనమైన జయరాంరావు పార్కు శిథిలం కావడంతో ఆ స్థలంలో వార్డు సచివాలయం ఏర్పాటు చేశారు. శ్రీరామనగర్ కాలనీలోని పార్కు శిథిలావస్థకు చేరడంతో ఆ పార్కు వినియోగంలో లేదు. పానగల్ రోడ్డులోని ఎన్టీఆర్ పార్కు ఏర్పాటు చేయడంతో అన్ని వసతులు కల్పిస్తారని పట్టణ ప్రజలు ఆశించారు. అయితే పాత పార్కుల పరిస్థితే ఎన్టీఆర్ పార్కుకూ ప్రాప్తించింది. పార్కులో స్ప్రింక్లర్లు పనిచేయకపోవడంతో మొక్కలు చాలావరకు ఎండిపోతున్నాయి. పిల్లల ఆటవస్తువులు పెద్దలు ఉపయోగించడం వల్ల దెబ్బతిన్నాయి.



ఎన్టీఆర్ పార్కులో దెబ్బతిన్న ఆటవస్తువులు



నీరు సక్రమంగా పట్టకపోవడంతో ఎండిన మొక్కలు



పాచిపట్టిన చిన్నపిల్లల స్విమ్మింగ్ పూల్

ఏ ఒక్క పార్కూ సక్రమంగా లేదు

శ్రీకాళహస్తి పట్టణంలో సేదతీరడానికి ఒక్క పార్కు కూడా సక్రమంగా లేదు. జయరామరావు పార్కు వాడుకలో లేదు. శ్రీరామనగర్‌కాలనీ, హౌసింగ్‌బోర్డు కాలనీ పార్కులు సరైన వసతులు లేకపోవడంతో అలంకారప్రాయంగా మారాయి. ఎన్టీఆర్ పార్కులో సరైన వసతులు కల్పించకపోవడంతో అధ్వానంగా మారింది. –నాగరాజు, శ్రీకాళహస్తి

టాయిలెట్లు ఏర్పాటు చేయాలి

పార్కులో టాయిలెట్లు, మంచినీటి వసతి కల్పించాలి. ఆట వస్తువులు చాలా వరకు పనిచేయడం లేదు. పార్కులో ఏర్పాటు చేసిన స్విమ్మింగ్ పూల్ నీరు అపరిశుభ్రంగా పాచిపట్టి ఉంది. దానిలో దిగితే రోగాలు తప్పవు. విద్యుత్ లైట్లన్నీ వెలగకపోవడంతో రాత్రి సమయంలో అవస్థలు పడుతున్నాం. – భాస్కర్‌రెడ్డి, బీపీ అగ్రహారం

లోటుపాట్లు సరిదిద్దుతాం

ఎన్టీఆర్ పార్కులో లోటుపాట్లు ఉంటే వాటిని సరిదిద్ది అందరికీ అందుబాటులోకి తీసుకువస్తాం. తాగునీటి వసతి కల్పిస్తాం. టాయిలెట్లను కూడా వినియోగంలోకి తెస్తాం. స్ప్రింక్లర్లకు మరమ్మతులు చేయించి మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకుంటాం. శ్రీరామనగర్ కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ పార్కులను కూడా వాడుకలోకి తీసుకువస్తాం. ఎన్టీఆర్ పార్కులో మెరుగైన వసతులు కల్పిస్తాం. –బాలాజీనాయక్, మున్సిపల్ కమిషనర్, శ్రీకాళహస్తి

నేడు భూమిపూజ

ఏర్పేడు: స్థానిక ప్రధాన కూడలిలో బుధవారం పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి చేతుల మీదుగా భూమి పూజ చేయనున్నట్టు వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య మంగళవారం తెలిపారు. ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు హాజరు కావాలని కోరారు.

పిల్లలను బడిలో చేర్చాలి



పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న అరుణ

ఏర్పేడు: బడిఈడు పిల్లలను బడిలో చేర్చాలని యువనేస్తం అసోసియేషన్ మండల కో–ఆర్డినేటర్ అరుణ అన్నారు. మంగళవారం మండలంలోని పోతుమానిగుంట, కుమ్మరిగుంట, జంగాలపల్లె ఎస్టీ కాలనీల్లో బడిఈడు పిల్లల గుర్తింపు కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, ఎస్టీ గ్రామాల్లో తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుకు దూరంగా ఉంచడం, తమవెంట అడవులకు తీసుకుని వెళ్లి ఈతాకు, బూరకబంక తీయడంలాంటి పనులు చేయించడం సరికాదన్నారు. బడిఈడు పిల్లలను వచ్చే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పాలన్నారు. యువనేస్తం అసోసియేషన్ వలంటీర్లు లక్ష్మి, స్రవంతి, స్వాతి, శైలజ పాల్గొన్నారు.

ఆర్‌బీకేల సేవలు సద్వినియోగం చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీ సుబ్రమణ్యం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని రైతు భరోసా కేంద్రాల సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏడీ సుబ్రమణ్యం కోరారు. మంగళవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో రైతులకు, సిబ్బంది పలు అంశాలపై ఆయన అవగాహన కల్పించారు. భరోసా కేంద్రాల ద్వారా రైతులు 21 రకాల సేవలు అందిస్తున్నామని, ముఖ్యంగా వైఎస్ఆర్ రైతు భరోసా, నాణ్యమైన ఉత్పాదకాల సరఫరా, సబ్సిడీ విత్తనాలు పంపిణీ, ఈ–పంట నమోదు, మార్కెట్ ధరలు, వ్యవసాయ యాంత్రీకరణ, పశువైద్యం, ఉద్యానవనశాఖ, పట్టుపరిశ్రమ, వాతావరణ సూచనలు, సలహా మండళ్లు, మట్టి పరీక్షలు ఉన్నాయని సేవల గురించి వివరించారు. ఈ సేవలను రైతులు సద్వినియోగం చేసుకుని పంటల సాగులో మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి భారతి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

'ఐసర్' భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి



కలెక్టర్ వెంకటరమణారెడ్డికి వినతి పత్రం ఇస్తున్న సీపీఐ, ఏఐటీయూసి నాయకులు

ఏర్పేడు: మండలంలోని జంగాలపల్లె ఐసర్‌లో పని చేస్తున్న భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు కలెక్టర్ వెంకటరమణారెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. మంగళవారం కలెక్టర్‌ను ఆయన కార్యాలయంలో కలిశారు. ఐసర్‌లో మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, చత్తీస్‌ఘడ్ తదితర రాష్ట్రాలకు చెందిన సుమారు 1200 మంది భవన నిర్మాణ కార్మికులు ఉన్నారని చెప్పారు. కార్మికులు ఉన్న ప్రాంతంలో పారిశుద్ధ్యం లోపించిందన్నారు. మురుగునీటి మూలాన పారిశుధ్యం సమస్యలతో వందలాది మంది కార్మికులు విరేచనాలు, వాంతులు, విషజ్వరాల బారిన పడి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని పేర్కొన్నారు. ఈ క్రమంలో కార్మికుడు సునీల్‌కుమార్ మృతి చెందారన్నారు. కార్మికుల వసతులు, ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహిస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను సందర్శించిన డీఈఓ



ల్యాబ్‌ను పరిశీలిస్తున్న డీఈఓ శేఖర్

వరదయ్యపాళెం: వేసవి సెలవుల నేపథ్యంలో స్థానిక హైస్కూల్‌లో విద్యార్థులకు నిర్వహిస్తున్న అటల్ టింకరింగ్ బూత్ క్యాంప్‌ను మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి శేఖర్ తనిఖీ చేశారు. టింకరింగ్ ల్యాబ్‌లో విద్యార్థులు ఏం నేర్చుకుంటున్నారో అడిగి తెలుసుకున్నారు. ఈ శిక్షణా తరగతులు సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ సూచించారు.

కాలభైరవునికి అభిషేక పూజలు



రేణిగుంట: శ్రీకాళహస్తి ఆలయంలో బుధవారం రాత్రి ఆలయ పండితులు కాలభైరవునికి అభిషేక పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేదమంత్రాలను పఠిస్తూ చందనం, కుంకుమ అభిషేకాలను నిర్వహించి కర్పూర హారతులు సమర్పించారు. భక్తులు అభిషేక పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించారు.

ప్రతిభావంతులకు సన్మానం



శ్రీకాళహస్తిలో విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు

రేణిగుంట: విద్యార్థులు ఒక లక్ష్యం నిర్దేశించుకుని దానిని సాధించేందుకు కృషి చేయాలని తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ఆర్కాడు శంకర్ అన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి ప్రతిభ చూపిన విద్యార్థులను మంగళవారం ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించడం చాలా ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో మంచి స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెంలో..



ఉత్తమ ఫలితాలు సాధించిన పదో తరగతి విద్యార్థినిని సత్కరిస్తున్న డీఈఓ

వరదయ్యపాళెం: పది ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన స్థానిక జెడ్పీ హైస్కూలుకు చెందిన ఝాన్సీ, రీష్మకుమారిని జిల్లా విద్యాశాఖాధికారి శేఖర్ మంగళవారం ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్, అటల్ టింకరింగ్ ల్యాబ్ నిర్వాహకులు వెంకటేష్, పురుషోత్తం, ప్రధానోపాధ్యాయులు మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



బుచ్చినాయుడుకండ్రిగ : విద్యార్థులను సన్మానిస్తున్న వేలూరు రాకేష్

బుచ్చినాయుడుకండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: పది, ఇంటర్ పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు మండలంలోని పీవీకండ్రిగ గ్రామ సర్పంచ్ కోటమ్మ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా సోషల్ మీడియా కో–ఆర్డినేటర్ వేలూరు రాకేష్, వైస్ ఎంపీపీ మునికృష్ణారెడ్డి, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శులు జొన్నల గోపాల్‌రెడ్డి, ఉగ్గుమూడి గురునాథం, మండల ఎస్సీ సెల్ కన్వీనర్ గురవయ్య, ఎంపీటీసీ సభ్యుడు రవి చేతుల మీదుగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇంటర్‌మీడియెట్‌కు సంబంధించి స్వరూప, సాయిప్రియ, వంశీ, పదవ తరగతికి సంబంధించి పావని, హర్షవర్ధన్‌ను సన్మానించారు. మారుమూల గ్రామంలో ఉన్నా విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించటం చాలా సంతోషంగా ఉందని, ఇదంతా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థుల చదువుల కోసం చేస్తున్న కృషి ఫలితమేనని రాకేష్ అన్నారు. గ్రామస్తులు బాలశేఖర్, దుర్గయ్య, చెంచయ్య, వెంకటయ్య, గోపి పాల్గొన్నారు.

భర్తను అడ్డు తొలగించుకునే యత్నం

ఎన్నో ఆశలతో అతను ఆమెను మనువాడాడు.. కానీ.. ఆమె మాత్రం అంతకు ముందే మరొకరితో ప్రేమాయణంలో ఉంది.. ఈ మోజులో పడి కట్టుకున్న భర్తనే కడతేర్చాలనుకుంది. ప్రియుడితో కలిసి పథకం వేసింది. ఇద్దరూ కలిసి అమలు చేశారు. ఆమె భర్తపై ప్రియుడు హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఏమీ తెలియనట్లు ఆమె నటించింది. పోలీసుల దర్యాప్తులో ఈ దారుణం వెలుగు చూసింది. నిందితులిద్దరూ కటకటాల పాలయ్యారు.

- ప్రియుడితో కలిసి పథకం
- పెనిమిటిపై హత్యాయత్నం
- నిందితుల అరెస్ట్

సిద్దవటం(అన్నమయ్య జిల్లా): ఓ యువతి ప్రియుడితో కలిసి ఏకంగా భర్తపైనే హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సిద్దవటం మండలంలోని కనుమలోపల్లె సమీపంలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను మంగళవారం సాయంత్రం సిద్దవటం పోలీసుస్టేషన్‌లో విలేకరుల సమావేశంలో కడప డీఎస్పీ ఎండీ షరీఫ్ వెల్లడించారు. తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తికి చెందిన అవ్వరు జ్ఞానేశ్వర్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. మూడు నెలల కిందట కడప హనుమప్ప వీధికి చెందిన నవితతో వివాహం జరిగింది. గత నెల 19వ తేదీన శ్రీకాళహస్తి నుంచి తన భార్యను పిలుచుకొని కడపలోని అత్తగారి ఇంటి వద్దకు తీసుకుని వచ్చాడు. తిరిగి జ్ఞానేశ్వర్ శ్రీకాళహస్తికి వెళ్లాడు. అదే నెల 25వ తేదీన అత్తగారి ఇంటిలో ఉన్న తన భార్యను పిలుచుకొని వెళ్లేందుకు కడపకు వచ్చాడు. ఆరోజు రాత్రి అత్తగారి ఇంట్లోనే బసచేసి మరుసటిరోజు 26వ తేదీన ఉదయం తన భార్యను వెంటబెట్టుకొని కడప నుంచి కారులో శ్రీకాళహస్తికి బయలుదేరాడు. సిద్దవటం మండలంలోని కనుమలోపల్లె గ్రామ సమీపంలోకి రాగానే తనకు వాంతికి వస్తుందని కారు ఆపాలని భర్తతో చెప్పడంతో ఆయన కారును ఆపాడు. ఇంతలోనే అకస్మాత్తుగా కడపలోని హనుమప్ప వీధికి చెందిన జాహ్నవి కాపిష దుర్గేష్‌సింగ్ అక్కడికి వచ్చి జ్ఞానేశ్వర్‌పై కత్తితో దాడి చేసి పరారయ్యాడు. భార్య నవిత తనకేమీ తెలియనట్లు భర్తను వైద్యం కోసం కడపలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించింది. ఈ ఘటనపై జ్ఞానేశ్వర్ గత నెల 27వ తేదీన సిద్దవటం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై ఎస్ఐ తులసీ నాగప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా 10 రోజుల్లోనే హత్యాయత్నం కేసును ఛేదించారు. నవితకు వివాహం జరగక ముందే పక్కింటికి చెందిన ఎంబీఏ చదువుతున్న జాహ్నవి కాపిష దుర్గేష్ సింగ్‌తో ప్రేమలో ఉంది. నవితకు వివాహం అయినప్పటికీ భర్త జ్ఞానేశ్వర్‌తో అయిష్టంగానే కాపురం కొనసాగించింది. ఏప్రిల్ 26వ తేదీన భర్తను హతమార్చాలని ప్రియుడితో కలిసి స్కెచ్ వేసింది. కనుమలోపల్లె గ్రామ సమీపంలో వాంతి వస్తోందని భర్తను నమ్మించి కారును ఆపింది. భర్తపై ప్రియుడి చేత కత్తితో హత్యాయత్నం చేయించింది. ఈ విషయాలు పోలీసుల దర్యాప్తులో వెలుగులోకి వచ్చాయి. ఈ ఘటనకు సంబంధించి మంగళవారం ఉదయం 11 గంటలకు కడప నగరం ఔటర్‌రింగ్ రోడ్డులో నవిత ప్రియుడితో ఉందన్న సమాచారం రావడంతో వారిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు. హత్యాయత్నానికి వినియోగించిన మారణాయుధం, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరినీ సిద్దవటం కోర్టులో హాజరు పరిచారు. అనతి కాలంలోనే కేసును ఛేదించిన సిద్దవటం ఎస్ఐ తులసీ నాగప్రసాద్‌ను, ఆయన సిబ్బందిని జిల్లా ఎస్పీ అన్బురాజన్ అభినందించారు. కార్యక్రమంలో ఒంటిమిట్ట సీఐ పురుషోత్తంరాజు, ఎస్ఐ తులసీనాగప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చిదా స్పిన్నింగ్ మిల్లు కార్మికుల ధర్నా

పుత్తూరు రూరల్: పుత్తూరు చిదా స్పిన్నింగ్ మిల్లును అర్థాంతరంగా మూసివేయడాన్ని నిరసిస్తూ మంగళవారం కార్మికులు మిల్లు ఎదుట ధర్నా చేశారు. సీఐటీయూ యూనియన్ నాయకులు బాబు మాట్లాడుతూ, 2022 ఫిబ్రవరిలో లేబర్ డిపార్ట్‌మెంట్ సమక్షంలో కార్మిక సంఘ నాయకులు, యాజమాన్యం మధ్య కుదిరిన వేతన ఒప్పందం ప్రకారం నాలుగేళ్ల పాటు మిల్లును యథావిధిగా నడపాలని డిమాండ్ చేశారు. కానీ మిల్లు యాజమాన్యం ఏకపక్ష నిర్ణయంతో మిల్లు మూసివేయడంతో 171 మంది రెగ్యులర్ కార్మికులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. మరో 250 మంది తాత్కాలిక మహిళా కార్మికులు సైతం తీవ్రంగా నష్టపోయారన్నారు. కార్మిక సంఘాల మధ్య చిచ్చు పెట్టి యాజమాన్యం పబ్బం గడుపుకోవాలని చూస్తోందని ఆరోపించారు. కార్మికులంతా దీనిని వ్యతిరేకించి తమ హక్కులను కాపాడుకోవాలని కోరారు. కార్మికులకు జరుగుతున్న అన్యాయంపై తిరుపతి కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో సైతం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం ఈ విషయంలో జోక్యం చేసుకుని కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ నాయకులు రాజేంద్ర, మనోహర్, కాటయ్య, సీఐటీయూ యూనియన్ నాయకులు బాబు, నాగూర్, టీఎన్‌టీయూసీ నాయకులు ఏలుమలైరెడ్డి, సమాచార హక్కుల వేదిక కార్యదర్శి కె.మురగారెడ్డి పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు

- ప్రతి ఇంటికీ రూ.లక్ష నుంచి రూ.4లక్షల వరకు సంక్షేమ పథకాల లబ్ధి
- ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను ఇస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

సత్యవేడు: అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. మంగళవారం సత్యవేడులోని రామనగర్, కోటమిట్ట, ఉలవచేను ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. 247 కుటుంబాలను ఎమ్మెల్యే పలకరించారు. ప్రతి ఇంటికీ రూ.లక్ష నుంచి రూ.4లక్షల వరకు సంక్షేమ పథకాల లబ్ధి చేకూరిందని సంక్షేమ బుక్‌లెట్లతో లబ్ధిదారులకు వివరించారు. రెండవ సచివాలయ పరిధిలో 27 మందికి ఇంటి పట్టాలు మంజూరు చేశామన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాలనను మరిపిస్తోందన్నారు. సీఎం లక్షలాది మంది పేదల సొంతింటి కల నెరవేర్చడంతో పాటు పథకాలతో ఆర్థిక భరోసా, ఆరోగ్య భద్రత కల్పించడంతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు .

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

కోటమిట్ట, ఉలవచేనులలో మట్టి రోడ్లను సిమెంటు రోడ్లుగా ఆధునీకరించాలని, పల్లపు వీధుల్లో వర్షపునీరు నిలచి రాకపోకలకు ఇబ్బందిగా ఉందన్నారు. ఉలవచేను, రామనగర్ సమీపంలోని కోటమిట్ట ప్రాంతంలో పలువీధుల్లో మురుగు కాలువలు నిర్మించాలని స్థానికులు కోరారు. త్వరలో కోటమిట్ట, రామనగర్ ప్రాంతాల అభివృద్ధికి రూ.20 లక్షలు మంజూరు చేస్తామని, ఆ నిధులతో అభివృద్ధి చేస్తారని ఎమ్మెల్యే చెప్పారు. కోటమిట్టలో సిమెంటు రోడ్లపైనే ఉన్న విద్యుత్ స్తంభాలను రోడ్డుకు దూరంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు. దీనిపై ట్రాన్స్‌కో అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. మండల కన్వీనర్ కే.సుశీల్ కుమార్ రెడ్డి, ఎంపీపీ వి.ప్రతిమ, మాస్టర్ స్కూల్ చైర్మన్ కే.చంద్రశేఖర్ రెడ్డి, సురుటుపల్లి ఆలయ చైర్మన్ ఏఎంఎం బాలాజీ రెడ్డి, వ్యవసాయ సంఘ అధ్యక్షుడు శ్యాంప్రసాద్ రెడ్డి, సచివాలయ కన్వీనర్ల మండల అధ్యక్షుడు బొప్పన సోమశేఖర్, మహిళా అధ్యక్షురాలు మస్తానమ్మ, పార్టీ ముఖ్య నాయకులు పునిదకుమార్, ఎంపీ రవి, బి.సురేంద్రరెడ్డి, దీనదయాళ్, దయాళన్, శ్రీనివాసులు రెడ్డి, మునివేలు, పూల పళణి, టెంకాయల కృష్ణయ్య, రమణ, శరవణన్, ఎంపీడీఓ రమణకుమార్, ఈఓపీఆర్డీ ముని రవి కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు నాగాలాపురంలో గడప గడపకు..

పిచ్చాటూరు: నాగలాపురంలో మండల కేంద్రంలోని నాగలాపురం–1 సచివాలయ పరిధిలో బుధవారం మధ్యాహ్నం సాయినగర్, మిరప తోట ప్రాంతాల్లో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తారని పార్టీ మండల కన్వీనర్ అపరంజిరాజు తెలిపారు.

కిళియమ్మ సేవలు అభినందనీయం



శ్రద్ధాంజలి ఘటిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వరదయ్యపాళెం: బీఎన్‌కండ్రిగ మార్కెటింగ్ కమిటీ చైర్‌పర్సన్ వ్యవహరించిన దివంగత నాయకురాలు బందిల కిళియమ్మ సేవలు అభినందనీయమని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు నాయుడు దయాకర్‌రెడ్డి (వరదయ్యపాళెం), ఆరణి విద్యానాథరెడ్డి (బీఎన్‌కండ్రిగ) స్మరించారు. మంగళవారం కంచరపాళెంలో ఆమె ద్వితీయ వర్ధంతిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి బందిల బాలయ్య తనయుడు బందిల సురేష్ నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పలువురు నాయకులు పుష్పాంజలి ఘటించారు. అనంతరం స్థానికులకు అన్నదానం చేశారు. పలువురు కిళియమ్మ సేవలను ప్రస్తుతించారు. మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు చంద్రారెడ్డి, మార్కెటింగ్ కమిటీ వైస్ చైర్మన్ పాల సుబ్రమణ్యం రెడ్డి, మాజీ సర్పంచులు చిన్నా, తిలక్‌బాబు, సర్పంచులు దుడ్డు వేణు, శ్రీధర్‌రెడ్డి, పార్టీ నాయకులు ఉమాపతి, కుమార్‌రెడ్డి, మహేంద్ర, మాధవయ్య, సుబ్రమణ్యం పాల్గొన్నారు.